సాక్షి మెదక్

మంగళవారం । 19 । మార్చి । 2024



ప్రకృతి వ్యవసాయమే మేలు

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన ఆహార పంటలు పండుతాయని కేవీకే సీనియర్ శాస్త్రవేత్త రవికుమార్ తెలిపారు.


వివరాలు 8లో ▸



యూట్యూబ్‌లో చూసి చోరీ

లోన్ యాప్‌లో డబ్బులు తీసుకున్నాడు.. అవి ఎలా తీర్చాలో తెలియక యూట్యూబ్‌లో చూసి దొంగతనానికి పాల్పడి పోలీసులకు చిక్కాడు.

వివరాలు 8లో ▸



న్యూస్‌రీల్

ఆశీర్వదిస్తే అభివృద్ధి చేస్తా



పూజలు చేస్తున్న గాలి అనిల్‌కుమార్, నాయకులు

పెద్దశంకరంపేట(మెదక్): ఆశీర్వదిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని జహీరాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ అన్నారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో కలిసి మండలంలోని ఆరెపల్లిలో బీరప్ప జాతర ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో బీబీ పాటిల్, సురేశ్ షెట్కార్‌కు అవకాశం ఇచ్చినా.. వారు ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. తనను ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంతంలో పరిశ్రమలు, యువతకు ఉపాధి, రైతులకు సాగునీటిని తీసుకొస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. తప్పుడు హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ఎంపీ బీబీ పాటిల్ కంగ్టి ప్రాంతంలో పరిశ్రమల పేరుతో పేద రైతుల భూములను స్వాధీనం చేసుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారంలో రూ. 144 కోట్లు సంపాదించుకున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మురళి, వైస్ ఎంపీపీ లక్ష్మి, గొల్ల కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు గంగారాం, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

జిల్లా గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు



మెదక్ కలెక్టరేట్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా గ్రీవెన్స్ కమిటీ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆధ్వర్యంలో ఎన్నికైంది. కమిటీ జిల్లా అధికారులుగా డీఆర్డీఏ శ్రీనివాసరావు (9281484100), జిల్లా ఆడిట్ అధికారి రాకేశ్ (9948213828), జిల్లా ట్రెజరీ అధికారి చిన్న సాయిలు (7799934150) నియామకం అయ్యారు. ఈ కమిటీ సభ్యులు ఎన్నికల నిబంధనల ప్రకారం రూ. 50 వేల కంటే ఎక్కువ మొత్తంలో డబ్బులు ఎలాంటి ఆధారాలు లేకుంటే తరలిస్తే సీజ్ చేస్తారు. తగిన ఆధారాలు చూపిన తర్వాత జిల్లా గ్రీవెన్స్ కమిటీ పరిష్కరించి అందజేస్తారు.

22 నుంచి జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

మెదక్ కలెక్టరేట్: ఈనెల 22 నుంచి స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత అధ్యక్షతన ప్రారంభం అవుతాయని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

సింగూరు నీరు అందించండి



ఎస్ఈ మురళీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

సంగారెడ్డి టౌన్ : సింగూరు కుడి కాలువ ద్వారా సాగునీరు ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు గొల్లపల్లి జయరాజు అన్నారు. సోమవారం జిల్లా ఇరిగేషన్ శాఖ ఎస్ఈ మురళీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగూరు ప్రాజెక్టు ప్రారంభమై ఏళ్లు గడుస్తున్నా సదాశివపేట, కొండాపూర్, మునిపల్లి మండలాల రైతాంగానికి సాగునీరు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. సాగునీరు లేక పంటలకు నష్టం కలిగి రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని చెప్పారు. వానాకాలం సీజన్‌లోనైనా సాగునీరు ఇవ్వకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య, మహేష్, రవి, రైతులు పాల్గొన్నారు.

కులమత రాజకీయాలు చెల్లవు

చేర్యాల(సిద్దిపేట): లౌకిక, ప్రజాస్వామ్య వ్యవస్థ అయిన దేశంలో కుల మతాల పేరుతో చేసే రాజకీయాలు చెల్లవని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చేరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా చేర్యాలలో ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూళ్మిట్ట మండలాల కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల నుంచి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో వసూలు చేసిన వేలకోట్ల రూపాయలు ఖర్చు చేసి గెలవాలని చూస్తోందన్నారు.

99.72%

- మొదటి రోజు విద్యార్థుల హాజరు
- ప్రశాంతంగా ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు



నర్సాపూర్: పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

మెదక్ కలెక్టరేట్: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా మొత్తం 10,303 మందికి గానూ 10,274 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 29 మంది గైర్హాజరు కాగా 99.72 హాజరు శాతం నమోదైనట్లు డీఈఓ రాధాకిషన్ తెలిపారు. జిల్లాలో విద్యార్థుల కోసం 68 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు తాగునీరు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచామన్నారు. పరీక్షలు ఉదయం 9.30 గంటలకు ప్రారంభం కాగా 5 నిమిషాల గ్రేస్ టైం కల్పించినట్లు చెప్పారు. గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచన చేయడంతో విద్యార్థులు సకాలంలో తరలివచ్చినట్లు వివరించారు. జిల్లాలోని కొడిపల్లి పరీక్ష కేంద్రాన్ని అదనపు కలెక్టర్ రమేశ్, రామాయంపేట, నిజాంపేట, చిన్నశంకరంపేటలోని 9 కేంద్రాలను డీఈఓ రాధాకిషన్, పాపన్నపేట, మనోహరాబాద్, తూప్రాన్, చేగుంటలో గల 18 పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం సందర్శించి పరిశీలించారు. పరీక్ష కేంద్రాలకు వంద మీటర్ల దూరం వరకు 144 సెక్షన్ అమలు చేశారు. అలాగే విద్యార్థులు ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.



విద్యార్థికి ముద్దు పెట్టి ఆల్ ద బెస్ట్ చెప్తున్న తల్లి

లైబ్రరీ.. వర్రీ

- పోటీ పరీక్షల పుస్తకాలు కరువు
- తీవ్రంగా వేధిస్తున్న సిబ్బంది కొరత
- నిరుపేద విద్యార్థులకు తప్పని కష్టాలు



మెదక్ గ్రంథాలయంలో చదువుకుంటున్న అభ్యర్థులు

మెదక్: గ్రంథాలయాలు.. ఆధునిక దేవాలయాలు. సరస్వతి కొలువైన క్షేత్రాలు. అయితే జిల్లాలో మాత్రం వాటి పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. వరుస ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదలవుతున్న నేపథ్యంలో యువతకు బాసటగా నిలుస్తాయనుకుంటే సమస్యలకు నిలయాలుగా మారాయి. సిబ్బంది కొరతతో పాటు వసతులు కరువయ్యాయి. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో లేవు. దీంతో నిరుపేద ఉద్యోగార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

వరుసగా పరీక్షలు

జిల్లాలో డిగ్రీ ఆపై చదువులు పూర్తి చేసుకొని 50 వేలకు పైగా నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధం అవుతున్నారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పలు రకాల ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో గ్రూప్–1 ప్రిలిమ్స్ జూన్‌లో ఉండగా, గ్రూప్ 2 అక్టోబర్, టెట్ మే, డీఎస్సీ జూలైలో నిర్వహిస్తామని పేర్కొంది. నిరుద్యోగ యువత పుస్తకాలతో కుస్తీ పడుతుండగా, ఆర్థికంగా ఉన్న విద్యార్థులు హైదరాబాద్‌కు వెళ్లి కోచింగ్ తీసుకొని ప్రిపేర్ అవుతున్నారు. కానీ పేద విద్యార్థులు మాత్రం జిల్లాలోని ఆయా మండల కేంద్రాల్లో ఉన్న గ్రంథాలయాల్లో చదువుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. అయితే వాటిలో పోటీ పరీక్షలకు ఉపయోగపడే బుక్స్‌లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో మాత్రమే కొంతమేర బుక్స్ ఉండగా, మండల కేంద్రాల్లోని శాఖా గ్రంథాలయాల్లో ఎలాంటి పుస్తకాలు అందుబాటులో లేవు.

జిల్లాలో 16 గ్రంథాలయాలు

జిల్లాలో 15 శాఖా గ్రంథాలయాలు, ఒక జిల్లా గ్రంథాలయంతో మొత్తం 16 ఉన్నాయి. వీటిలో జిల్లా గ్రంథాలయంలో మూడు ఉండాల్సి ఉండగా మండల కేంద్రాల్లో గల శాఖా గ్రంథాలయాల్లో ఒక్కొక్కరి చొప్పున జిల్లాలో మొత్తం 18 మంది లైబ్రేరియన్లు ఉండాల్సి ఉండగా కేవలం 4 గురు మాత్రమే ఉన్నారు. వీరితో పాటు మరో నలుగురు ఔట్‌సోర్సింగ్ పద్ధతిన విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే 17 మంది అటెండర్లు ఉండాల్సి ఉండగా కేవలం ముగ్గురు మాత్రమే ఉన్నారు. అంతేకాకుండా సొంత భవనాలు సైతం లేవు. అద్దె భవనాలతో పాటు కమ్యూనిటీ హాల్స్‌లో కొనసాగిస్తున్నారు. ఒక్కో లైబ్రేరియన్‌కు 3 నుంచి 4 లైబ్రరీల అదనపు బాధ్యతలు అప్పగించారు. వీరు ఒక్కో రోజు ఒక చోట విధులు నిర్వర్తిస్తున్నారు.

బుక్స్ లేవు



జిల్లా కేంద్రంలోని లైబ్రరీలో పోటీ పరీక్షలకు సంబంధించిన బుక్స్ లేవు. ముఖ్యంగా డీఎస్సీతో పాటు గ్రూప్స్‌కు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంచాలి.

– సౌముక, నిరుద్యోగ యువతి, మెదక్

త్వరలో తెప్పిస్తాం



నిరుద్యోగుల కోరిక మేరకు వారు కోరిన బుక్స్ తెప్పిస్తున్నాం. ఇటీవల కొందరు కొత్తగా వచ్చారు. వారి సూచనల మేరకు త్వరలో మరిన్ని పుస్తకాలు గ్రంథాలయాల్లో ఉండేలా చూస్తాం.

– నరేందర్‌రెడ్డి, మెదక్ లైబ్రేరియన్

పకడ్బందీగా ఎన్నికలు

జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్‌రాజ్



వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, పక్కన ఎస్పీ బాలస్వామి

మెదక్: పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేశామని కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్‌రాజ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎస్పీ బాలస్వామితో కలిసి వివరాలు వెల్లడించారు. మెదక్ పార్లమెంట్ పరిధిలోకి మెదక్, నర్సాపూర్, సంగారెడ్డి, పటాన్‌చెరు, దుబ్బాక, గజ్వేల్, సిద్దిపేట సెగ్మెంట్లు వస్తాయన్నారు. ఏప్రిల్ 18 నుంచి 25 వరకు మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. పార్లమెంట్ పరిధిలోని మొత్తం 18,12,858 మంది ఓటర్లు ఉండగా ఇందులో మహిళలు 9,16,876, పురుషులు 8,95,777, ఇతరులు 205 మంది ఉన్నారని తెలిపారు. ఇంటి వద్ద ఓటు వేసేందుకు ఎన్నికల కమిషన్ నూతన నిబంధనలు తెచ్చిందన్నారు. 85 ఏళ్లు దాటిన వృద్ధులతో పాటు 40 శాతం పైబడిన వికలాంగులు ఇంటి వద్ద ఓటు వేసేందుకు వీలు ఉందన్నారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో వీరి సంఖ్య 3 వేల పైచిలుకు ఉందని, వారికి ఇప్పటికే ఫాం 12–డీ ఇచ్చామని స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనల మేరకు ఒక వ్యక్తి వద్ద రూ. 50 వేల కంటే ఎక్కువ ఉంటే సీజ్ చేస్తామన్నారు. జిల్లా సరిహద్దులో 10 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 72 ఆదర్శ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎన్నికలకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంలను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడితే 1950 నంబర్‌కు ఫోన్ చేయడంతో పాటు సీ–విజిల్ యాప్ ద్వారా వీడియోలు, ఫొటోలు అప్‌లోడ్ చేస్తే వెంటనే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

మెదక్ కలెక్టరేట్: ఎన్నికల కోడ్ వెలువడిన నేపథ్యంలో జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలు పాటించాలని, కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీలు తమ ప్రచార వివరాలు మూడు రోజుల ముందుగానే తెలియజేయాలని సూచించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా పాయింట్, కాల్ సెంటర్లను పరిశీలించారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆంజనేయులు, నర్సింహులు, ఎంఎల్ఎన్ రెడ్డి, సిద్దిరాములు, సయ్యద్ సాకేత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి: ఎస్పీ

ముందస్తు ప్రణాళికతోనే ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించగలుగుతామని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ బాలస్వామి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డితో కలిసి జిల్లాలోని పోలీస్ అధికారులతో ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికలకు పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని, దానికి అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

భూమి ఇప్పిస్తానని మోసం చేశాడు

అదనపు ఎస్పీకి బాధితురాలు ఫిర్యాదు



బాధితులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ మున్సిపాలిటీ: వ్యవసాయ భూమి ఇప్పిస్తానని రూ.3 లక్షలు తీసుకొని జిరాక్స్ పత్రాలు చేతిలో పెట్టాడు. ఎంతకు భూమి ఇప్పించకపోవడంతో నిలదీయగా చంపుతానంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. అతడిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలంటూ బాధితురాలు అదనపు ఎస్పీ మహేందర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణిలో భాగంగా అదనపు ఎస్పీ వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా తూప్రాన్ మండలం పోతరాజుపల్లికి చెందిన గౌనిబాటి రుక్కమ్మ ఫిర్యాదు చేశారు. స్పందించిన అదనపు ఎస్పీ బాధితురాలికి చట్టప్రకారం న్యాయం జరిగేలా చూడాలని తూప్రాన్ ఎస్ఐకి సూచించారు. అలాగే రామాయంపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన నక్కని రాకేష్ 2021లో ప్రేమించానని, పెళ్లి చేసుకోకుంటే చనిపోతానంటూ వెంటపడగా అతడి మాటలు నమ్మి పెళ్లి చేసుకుంటానని మాట ఇచ్చినట్లు అదే గ్రామానికి చెందిన గుర్రం స్రవంతి తెలిపింది. ఈ క్రమంలో నాలుగు నెలలుగా పెళ్లికి ఒప్పుకోవడం లేదని ఫిర్యాదు చేసింది. స్పందించిన ఆయన చట్టప్రకారం ఫిర్యాదికి తగిన న్యాయం చేయాలని రామాయంపేట ఎస్ఐని ఆదేశించారు. వీరితో పాటు పలువురు తమ తమ సమస్యలపై వినతులు అందజేశారు.

తైబజార్ వేలం రూ. 28.50 లక్షలు

తూప్రాన్: మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సోమవారం 2024– 25 ఆర్థిక సంవత్సరానికి గానూ నిర్వహించిన తైబజార్, పశువుల సంతకు కమిషనర్ ఖాజామోహిజోద్దీన్ అధ్యక్షతన వేలం నిర్వహించారు. ఈసందర్భంగా తైబజార్ వేలం అత్యధికంగా రూ. 28.50 లక్షలకు పట్టణానికి చెందిన తుమ్మల గణేశ్, పశువుల సంతను మహ్మద్ జాఫర్ రూ. 2.40 లక్షలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రఘువరన్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



తైబజార్ వేలం నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యం



ఎమ్మెల్యేలు, నాయకులతో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

జహీరాబాద్ స్థానం హస్తగతం చేసుకుందాం: మంత్రి దామోదర

జహీరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో తిరిగి జహీరాబాద్ స్థానాన్ని హస్తగతం చేసుకుందామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సోమవారం మంత్రి అధికార నివాసంలో పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజలంతా కాంగ్రెస్ వైపు చూస్తున్నారని, నియోజకవర్గంలో పార్టీకి మంచి ఓటు బ్యాంకు ఉందని, కొద్దిగా కష్టపడితే భారీ మెజార్టీ వస్తుందని పేర్కొన్నారు. రెండు పర్యాయాలు బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసి ఎంపీగా గెలుపొందిన బీబీ పాటిల్ నియోజకవర్గం ప్రజలకు చేసిందేమీ లేదని, దీంతో ప్రజలు అసంతృప్తితో ఉన్నారని వివరించారు. నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, జహీరాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు, ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, బాన్సువాడ, జహీరాబాద్ అసెంబ్లీల పార్టీ ఇన్‌ చార్జిలు ఏనుగు రవీందర్‌రెడ్డి, ఎ.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

‘రోబోటిక్స్’ అదరహో



ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సిద్దిపేట, ఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి రోబోటిక్స్ ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. సోహం అకాడమీ డైరెక్టర్ సహదేవులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాశాల భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 38 ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు వీటి ఉపయోగాలను వివరించారు. ఇందూరు ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతులు పోశయ్య, మల్లేశంలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి పలు ఉత్తమ మోడల్స్‌ను ఎంపిక చేశారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యనారాయణ ముగింపు సమావేశానికి హాజరై మంచి కార్యక్రమాన్ని రూపొందించారని కొనియాడారు. ఫిజిక్స్ విభాగాధిపతి, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ మధుసూధన్‌ను అభినందించారు. టీఎస్ఎంఎస్ ఎన్సాన్‌పల్లి, జెడ్పీహెచ్ఎస్ ఇందిరానగర్, జెడ్పీహెచ్ఎస్ తడ్కపల్లి విద్యార్థులు రూపొందించిన మోడల్స్ మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. రెండు సంవత్సరాలుగా రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించిన కళాశాల విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వాసం శ్రీనివాస్, పరీక్షల విభాగం సమన్వయకర్త డాక్టర్ గోపాల సుదర్శనం, ఫిజిక్స్ విభాగం అధ్యాపకులు డాక్టర్ మహేష్, భైరయ్య, కృష్ణయ్య, సౌమ్యతోపాటు ఆయా విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

భూమి ఉంది.. పేరు లేదు

ప్రజావాణిలో ‘ధరణి’ బాధితుల ఆవేదన



వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ రమేశ్, అధికారులు

మెదక్ కలెక్టరేట్: ‘భూమి కొనుగోలు చేసి పన్నెండేళ్లు అవుతున్నా, ఇంకా మా పేరున రికార్డులో ఎక్కించడం లేదు. ఇప్పటికే పలుమార్లు వినతులు సమర్పించినా సమస్య పరిష్కారం కాలేదు. తిరిగి తిరిగి వేసారి పోయాను. ఇప్పటికైనా మా సమస్యను పరిష్కరించండి అని చేగుంట మండలం వల్లపూర్ గ్రామ రైతు బత్తుల లింగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ధరణి రాక ముందు 4 ఎకరాల 10 గుంటల భూమి ఉండేదని.. ధరణి వచ్చాక కొత్త పట్టాదార్ పాస్ పుస్తకంలో 24 గుంటల భూమి రికార్డులోకి ఎక్కలేదని సూరారం గ్రామానికి చెందిన ఆముద బాలమణి వాపోయింది. తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తే మీసేవలో దరఖాస్తు చేయాలని చెప్పారని.. దరఖాస్తు చేసినా ఇప్పటికీ భూమి రికార్డు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది’. ప్రజావాణికి వచ్చిన సగం మంది ఇలాంటి సమస్యలనే ఏకరువు పెట్టారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించగా వివిధ సమస్యలపై 73 మంది వినతులు సమర్పించారు. అదనపు కలెక్టర్ రమేశ్, డీఆర్ఓ పద్మశ్రీ, జెడ్పీసీఈఓ ఎల్లయ్య ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి 73 వినతులు రాగా అందులో అత్యధికంగా 33 భూ సమస్యలు కాగా ఇతర సమస్యలపై మరో 40 దరఖాస్తులు వచ్చాయి.

క్లుప్తంగా

జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక


అజార్

మద్దూరు(హుస్నాబాద్): జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ జూనియర్ పోటీలకు మద్దూరు మండల కేంద్రానికి చెందిన కోడూరు మహమ్మద్ అజార్ హుస్సేన్ ఎంపికైయ్యారు. ఇటీవల వరంగల్ జిల్లా పైడిపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ తరఫున పాల్గొని ప్రతిభ కనబర్చాడు. ఈ నెల 23వ తేదీ నుంచి 27 వరకు మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ జట్టు తరఫున పాల్గొంటాడు.

చైర్మన్ నియామకాలన్నీ రద్దు చేయాలి

- మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింలు


మాట్లాడుతున్న నర్సింలు

హత్నూర(సంగారెడ్డి): మత్స్యశాఖలో నామినేటెడ్ చైర్మన్ నియామకాలన్నీ రద్దు చేయాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు గున్నాల నర్సింలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హత్నూర మండలం దౌల్తాబాద్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. మత్స్యకారుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసినప్పటికీ కార్పొరేషన్ చైర్మన్ నామినేటెడ్ పద్ధతిలో నియమించడం సరైంది కాదన్నారు. వెంటనే ప్రభుత్వం పునరాలోచించి రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించి చైర్మన్‌ను నియమించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా డైరెక్టర్లు రమేశ్, నాగరాజు, హనుమంతు, ఆగమయ్య, శ్రీనివాస్, లక్ష్మణ్, వెంకటేశం, నరేందర్ పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి జాతీయ స్థాయిలో గుర్తింపు

సంగారెడ్డి అర్బన్: బోనాలు, బతుకమ్మ వంటి సంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల చెందిన విద్యార్థిని ఎం సింధు తెలంగాణ రాష్ట్రానికి జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హరియానాలోని ఫరహాబాద్‌లో ఈ నెల 12వ తేదీ నుంచి 18 వరకు జరిగిన ఎన్ఎస్ఎస్ వారు జాతీయ సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. సింధు పాల్గొని తెలంగాణ వారసత్వ సంపదను ప్రదర్శించినందుకు అవార్డు లభించింది.

రైస్ మిల్లులపై విజిలెన్స్ దాడులు

హుస్నాబాద్: పందిల్లలోని రైస్‌మిల్లులు, పారాబాయిల్డ్ మిల్లుల్లో సోమవారం రాత్రి విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ అదనపు ఎస్పీ ప్రభాకర్, ఎఫ్‌సీఐ మేనేజర్ లక్ష్మారెడ్డి, ఎస్ఐలు కృష్ణ, జగ్గయ్య ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. రైతులు, ఐకేపీ, సొసైటీల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి బియ్యం అప్పగించాల్సి ఉంది. కాగా ధాన్యం స్టాక్ చూపించి పక్క రాష్ట్రాలకు అధిక ధరలకు మిల్లింగ్ చేసిన బియ్యం అమ్ముకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఫిర్యాదుల మేరకు పవనసుత పారాబాయిల్డ్ మిల్లులో సివిల్ సప్లయ్ లెక్కల ప్రకారం స్టాక్ ఉందా లేదా అని అధికారులు ఆరా తీశారు.

రైతు బజార్.. బేజార్

- రూ.1.27 కోట్లతో నిర్మాణం
- మూడేళ్లుగా నిరుపయోగం
- అరకొర సౌకర్యాలు
- కూరగాయల విక్రయాలకు ఆసక్తి చూపని వ్యాపారులు
- నిలిచిపోయిన సమీకృత మార్కెట్ పనులు


పిల్లర్ల వద్ద నిలిచిపోయిన సమీకృత మార్కెట్


జోగిపేటలోని రైతు బజార్‌లో నిర్మించిన దుకాణాల సముదాయం

జోగిపేట(అందోల్) : తాము పండించిన కూరగాయలను రైతులు ఒకే చోట విక్రయించేలా, కూరగాయలన్నీ ఒకే చోట ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం రూ.1.27 కోట్లతో జోగిపేటలో నిర్మించిన ×రైతు బజార్‌⁑ నిరుపయోగంగా మారింది. 15 దుకాణాలు, నాలుగు షెడ్‌లను నిర్మించి అందులో 60 మంది కూరగాయలను విక్రయించేలా 2021 జూలై మాసంలో నిర్మించారు. పోలీస్‌స్టేషన్ ముందు ఉన్న కూరగాయాల విక్రయాలను రైతు బజార్‌లోనే విక్రయించాలని మున్సిపల్ అధికారులు ప్రకటించినా ఫలితం దక్కలేదు.

ముందుకు రాని వ్యాపారులు

రైతు బజార్‌లో నిర్మించిన 15 దుకాణాలను వ్యాపారులకు అప్పగించేందుకు మార్కెటింగ్ అధికారులు రెండు, మూడు సార్లు నోటిఫికేషన్లు జారీ చేసినా ఎవరూ ముందుకు రాలేదు. అందరూ ఒకే చోట విక్రయిస్తేనే తాము రైతు బజార్‌లోకి వస్తామని కూరగాయల విక్రయదారులు చెబుతున్నారు. కొందరు పోలీస్‌స్టేషన్ ఎదుట, మరికొందరు రైతు బజార్‌లో విక్రయిస్తే ఇబ్బందులు తలెత్తుతాయని రైతులు వాపోతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులను కూడా విక్రయించొద్దని స్థానికులు అభ్యంతరం చెబుతున్నారు. ఈ విషయం పలుసార్లు గొడవలకు దారి తీసింది. పోలీసు అధికారులు, మార్కెటింగ్, మున్సిపాలిటీ అధికారులు గట్టి నిర్ణయం తీసుకొని రైతు బజార్‌లోనే అందరూ విక్రయించేలా చర్యలు తీసుకుంటే తప్ప ఇక్కడ విక్రయాలు జరిపే పరిస్థితి లేదు. ఇక్కడ మౌలిక సదుపాయాలు కల్పిస్తామని విక్రయదారులకు అధికారులు హామీ ఇచ్చినా నేటి వరకు పూర్తి చేయలేదన్న ఆరోపణలున్నాయి. ఆర్టీసీ బస్టాండ్‌కు దూరంగా ఉండడం, సౌకర్యాలు సరిగా లేవని వ్యాపారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నిలిచిపోయిన సమీకృత మార్కెట్..

రైతు బజార్‌ను ఆనుకొని సమీకృత మార్కెట్ నిర్మాణం పనులను చేపట్టేందుకు గత ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసింది. 2022 జూన్ మాసంలో అప్పటి ఎమ్మెల్యే క్రాంతికిరణ్ పనులను ప్రారంభించారు. రైతు బజార్‌లోని రెండు షెడ్‌లను కూలగొట్టి పెద్ద పెద్ద గుంతలను తవ్వి వదిలేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే పనులను నిలిచిపోయినట్లుగా అధికారులు చెబుతున్నారు. సమీకృత మార్కెట్‌లో కూరగాయలు, నాన్‌వెజ్, పండ్లు, పూలు వంటి అన్ని రకాల వస్తువులను విక్రయించేలా ప్రణాళికను రూపొందించారు. ఏడాదిగా పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. తహసీల్దార్ నివాస స్థలంలో కొంత భాగం, మిగితా ఖాళీ స్థలం కలుపుకొని 2 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ఈ విస్తీర్ణంలో 48 దుకాణాలు, పార్కింగ్ స్థలం తప్పనిసరి కావడంతో రైతుబజార్‌లోని ఓ దుకాణాల షెడ్‌ను తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతుబజార్‌ను వాడకంలోకి తీసుకురాకముందే షెడ్‌ను తొలగించడం ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నట్లేనని పలువురు అంటున్నారు.


సీసీ రోడ్లు వేస్తాం

రైతు బజార్‌లోని అంతర్గతంగా ఉన్న రోడ్లను సీసీ రోడ్లుగా మార్చేందుకు అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. రైతు బజార్‌ను వాడుకలోకి తీసుకొచ్చేలా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఆదేశించారు. 15 దుకాణాలను కూడా వ్యాపారులకు అప్పగించేలా చర్యలు తీసుకుంటాం. రైతు బజార్‌లో ఒకే చోట కూరగాయలు విక్రయించినట్లయితే ప్రజలకు కూడా ఉపయోగకరంగా ఉంటుంది.

– మాధవరెడ్డి, డిప్యూటీ ఈఈ, మార్కెటింగ్ శాఖ







మట్టి కుండ.. సల్లగుండ

ప్రస్తుత ఉరకలు, పరుగుల జీవితంలో ఎండతాపాన్ని తట్టుకోలేక ప్రజలు దాహం ..దాహం అంటున్నారు. కొంత మంది తమ శక్తి కొద్ది ఎలక్ట్రికల్ ఫ్రిజ్‌లు కొనుగోలు చేస్తే.. పేద ప్రజలు మాత్రం మట్టి కుండలను ఉపయోగిస్తున్నారు. మార్చి నెలలోనే ఎండలు మండిపోతుండడంతో పేదవాడి ఫ్రిజ్ అమ్మకాలు జోరందుకున్నాయి. మట్టి కూజాలు, కుండలు, వివిధ రకాల మట్టి పాత్రలను సిద్దిపేట పట్టణంలోని వేములవాడ కమాన్ వద్ద ఓ మహిళ విక్రయిస్తూ సాక్షి కెమెరా కంటపడ్డారు.

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

మా గ్రామాల్లో మద్యం నిలిపివేయండి

పోలీస్‌స్టేషన్‌లో మహిళల ఫిర్యాదు


పోలీస్‌స్టేషన్ వద్ద ప్లకార్డులతో మహిళలు

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని పన్యాల, బడంపేట గ్రామాల్లో మద్యం అమ్మకాలు నిలిపివేయాలని ఆయా గ్రామస్తులు, సత్య శోధన యువజన సంఘం సభ్యులు సోమవారం హత్నూర పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. దుకాణాదారులు గ్రామాల్లో అక్రమంగా మద్యం అమ్ముతున్నారని, దీంతో యువత, మగవారు తాగి ఇళ్లల్లో గొడవలు పడుతున్నారని పేర్కొన్నారు. ఇళ్లలో బంగారం సామగ్రి, రేషన్ బియ్యం అమ్ముకొని మరీ తాగుతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సభల్లోనూ మద్యం అమ్మకూడదని తీర్మాణించినట్లు తెలిపారు. వెంటనే పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పన్యాల, బడంపేట గ్రామానికి చెందిన 50 మంది మహిళలు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయమే మేలు


కేవీకేలో రైతులతో శాస్త్రవేత్తలు

- కేవీకే శాస్త్రవేత్త రవికుమార్

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన ఆహార పంటలు పండుతాయని కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, ప్రకృతి వ్యవసాయం ఇన్‌చార్జి రవి కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని తునికి వద్ద గల డాక్టర్ డి.రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయంలో ఎలాంటి ఖర్చు లేకుండా సహజ సిద్ధంగా పంటలు సాగు చేయొచ్చన్నారు. ఎలాంటి రసాయనాలు, పురుగుల మందుల అవశేషాలు లేని నాణ్యమైన ఆహార పంటలు పండుతాయన్నారు. వరితోపాటు కూరగాయలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు తదితర అన్ని రకాల పంటలను పండించవచ్చన్నారు. మార్కెట్‌లో సేంద్రియ పంటలకు అధిక ధర లభిస్తుందన్నారు. అనంతరం రైతులకు క్షేత్రస్థాయిలో ప్రకృతి వ్యవసాయానికి కావాల్సిన ఎరువులు, చీడపీడల నివారణకు పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో కేవీకే హెడ్ దత్తాత్రేయనల్కర్, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

సిగరేట్ కోసం గొడవ

- భవనం పైనుంచి తోసేసిన స్నేహితుడు
- తీవ్ర గాయాలతో యువకుడు మృతి


రోషన్ కుమార్(ఫైల్)

కంది(సంగారెడ్డి): భవనంపై నుంచి పడి యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ఇంద్రకరణ్‌లో చోటు చేసుకుంది. ఇంద్రకరణ్ ఎస్సై విజయ్ కుమార్ కథనం ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన ముగ్గురు స్నేహితులు అంకిత్, రోషన్ కుమార్ (21), అశోక్ కుమార్ ఇంద్రకరణ్ లో ఒకే గదిలో అద్దెకుంటూ ఓ పరిశ్రమలో పని చేస్తున్నారు. ఆదివారం రాత్రి భవనం నాలుగో అంతస్తులో ఉన్న పెంట్‌హౌస్ పైకి వెళ్లి మద్యం తాగారు. సిగరేట్ విషయంలో అంకిత్, రోషన్ మధ్య జరిగింది. ఈ క్రమంలో అంకిత్ రోషన్ కుమార్‌ను బిల్డింగ్ పైనుంచి కిందికి తోసేశాడు. వెంటనే మరో స్నేహితుడు అశోక్ కుమార్ ఇంటి యజమాని కొత్తపల్లి కిష్టయ్యతో కలిసి వెళ్లి చూడగా తలకు తీవ్ర గాయాలై రోషన్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. అంకిత్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఇంటి యజమాని కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి


బీరయ్య మృతదేహం

చిన్నశంకరంపేట(మెదక్): చేపల వేటకు వెళ్లి చెరువులో మునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన నార్సింగి మండలం సంకాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. నార్సింగి ఎస్ఐ అమ్మద్ మొహినొద్దీన్ కథనం మేరకు.. సోమవారం మధ్యాహ్నం సంకాపూర్ గ్రామానికి చెందిన పర్ష బీరయ్య(49) గ్రామానికి చెందిన మరో వ్యక్తితో కలిసి స్థానిక మైసమ్మ చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపల కోసం వేసిన వల కాళ్లకు చుట్టుకొని నీట మునిగి మృతి చెందాడు. భార్య నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నకిలీ మందులతోనే పంట దెబ్బతింది

దుకాణం ఎదుట రైతు ఆందోళన


కంపెనీ ప్రతినిధులతో గొడవ పడుతున్న రైతులు

కొండపాక(గజ్వేల్): నకిలీ మందులు వాడటంతోనే వరి పంట దెబ్బతిందని బాధిత రైతు సోమవారం షాపు ఎదుట ఆందోళనకు దిగాడు. ఈ ఘటన కొండపాక మండలంలోని దుద్దెడ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. దుద్దెడ గ్రామానికి చెందిన రైతు చిలుముల శ్రీనివాస్ తనకున్న 2 ఎకరాల 30 గుంటల భూమిలో వరి పంటను సాగు చేశారు. పంటకు తెగుళ్ల సోకడంతో 10 రోజుల కిందట వెలికట్ట గ్రామ శివారులోని పత్తి మందుల విక్రయ దుకాణంలోంచి ఓ మందును కొనుగోలు చేసి పంటకు పిచికారీ చేశారు. అనంతరం చేనంత ఎర్రబారి ఎండిపోవడంతో దుకాణదారుడిని సంప్రదించాడు. ఇక్కడ మందులు కొని వాడటంతోనే పంట పాడైపోయిందని, రూ.80 వేలు పెట్టుబడి పెట్టానని దుకాణం ఎదుట రైతు ఆందోళనకు దిగాడు. ఈ విషయాన్ని దుకాణదారుడు మండల వ్యవసాయాధికారి ప్రియదర్శిణీ, తెగుళ్ల నివారణ మందుల కంపెనీ ప్రతినిధులు పూర్ణచందర్‌రావు, దీపక్‌కు చెప్పాడు. కంపెనీ ప్రతినిధులు, వ్యవసాయ అధికారులు పంటను పరిశీలించి ఏ మందులు పిచికారీ చేశారన్న విషయాన్ని రైతును అడిగి తెలుసుకున్నారు. రైతు దుకాణాదారుడు ఇచ్చిన మందుల రసీదును, మందుల డబ్బాలను చూపించాడు. ఈ క్రమంలో అక్కడున్న మరి కొంతమంది రైతులు బాధిత రైతుకు నష్టపరిహారం చెల్లించాలని కంపెనీ ప్రతినిధులతో గొడవకు దిగారు. దెబ్బతిన్న పంట పిలకలను తీసుకెళ్లి ల్యాబ్‌లో పరీక్షలకు పంపిస్తామని రిపోర్టుల ఆధారంగా రైతుకు నష్ట పరిహారం చెల్లిస్తామని చెప్పడంతో రైతులు శాంతించారు. ఆందోళనలో రైతులు మిద్దె సురేశ్, దుస్స చంద్రం, జగపతి యాదగిరి, జక్కుల వోజయ్య, దోమల కనకయ్య, జక్కుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యూట్యూబ్‌లో చూసి.. చోరీ చేసి

- మహిళ మెడలో నుంచి గొలుసు అపహరణ
- లోన్ యాప్‌లో తీసుకున్న డబ్బులు తీర్చడానికే..
- పోలీసులకు చిక్కిన నిందితుడు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్

దుబ్బాక : అవసరాలకు లోన్ యాప్‌లో డబ్బులు తీసుకున్నాడు.. అవి ఎలా తీర్చాలో తెలియక సులువు డబ్బు సంపాదించాలని నిర్ణయించాడు. యూట్యూబ్‌లో చూసి దొంగతనానికి పాల్పడి పోలీసులకు చిక్కాడు. ఈ కేసుకు సంబంధించి వివరాలను దుబ్బాక సీఐ శ్రీనివాస్ సోమవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. రాజన్న సిరిసిల్లా జిల్లా ముస్తాబాద్ మండలం, గ్రామానికి చెందిన మ్యాన లవన్ కుమార్(34) ఫొటో స్టూడియో నడుపుతూ జీవనం సాగించేవాడు. లవన్ కుమార్ పెద్ద కూతురు అనారోగ్యం పాలవడంతో వైద్యం కోసం లక్షల్లో ఖర్చు చేశాడు. చేతిలో చిల్లి గవ్వ లేక పోవడంతో లోన్ యాప్‌లను ఆశ్రయించాడు. దాదాపు 8 లోన్ యాప్‌లలో రూ.1.60 లక్షలు తీసుకున్నాడు. వాటిని ఎలా కట్టాలో అర్థం కాక సులువుగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. యూట్యూబ్‌లో ఓ వీడియోను అనుసరించి ఈ నెల 14వ తేదీన దొంగతనానికి పాల్పడ్డాడు. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట భూంపల్లి మండలం ఎనగుర్తి గ్రామ శివారులో కొయాడ యాదమ్మ అనే మహిళ కల్లు కాంపౌండ్ నడుపుతుంది. కల్లు తాగడానికి అని వెళ్లిన లవన్ కుమార్ యాదమ్మను మాటల్లో దింపి ఆమె మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు గొలుసును అపహరించి బైక్ పై పారిపోయాడు. యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దుబ్బాక ఎస్సై గంగరాజు, మిరుదొడ్డి ఎస్సై పరుశరాములు రెండు టీమ్‌లుగా దర్యాప్తు మొదలు పెట్టాయి. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, దాదాపు 70 సీసీ కెమెరాలను పరిశీలించి ఆదివారం మధ్యాహ్నం ముస్తాబాద్ గ్రామంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి రెండున్నర తులాల బంగారు గొలుసు, సెల్ ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

గుంతలో పడ్డ కారు

- ఆరుగురికి గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రమాదవశాత్తు కారు అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకుపోవడంతో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని చర్ల అంకిరెడ్డిపల్లి శివారులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంగనర్ జిల్లా ఆరెపల్లి గ్రామానికి చెందిన ముత్యాల ప్రశాంత్‌కు భూంపల్లి మండలం చిన్న నిజాంపేటకు చెందిన అరుణ శ్రీతో ఆదివారం వివాహం జరిగింది. సోమవారం ఉదయం నవ దంపతులు, కుటుంబీకులు కారులో నిజాంపేటకు పని నిమిత్తం వెళ్లి తిరుగు ప్రయాణం అయ్యారు. చర్ల అంకిరెడ్డిపల్లి శివారులోకి రాగానే కారు అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకుపోయింది. దీంతో కారులో ఉన్న నవ దంపతులు వారి కుటుంబీకులు లావణ్య, ఈశ్వరమ్మ, స్పందన, మురళీకి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కోహెడ 108 సిబ్బంది క్షతగాత్రులను సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు.

పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని..

- మనస్తాపంతో మహిళ ఆత్మహత్య


కిష్టమ్మ మృతదేహం

వట్‌పల్లి(అందోల్): మనస్తాపంతో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని పోతులబోగుడా గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మొండి కిష్టమ్మకు(52) తన ఇంటి పక్క పాలివారితో ఈ నెల 15న గొడవ జరిగింది. ఈ విషయంలో అదే రోజు వట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో కిష్టమ్మపై పాలివారు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. తనపై కేసు నమోదైందని తెలిసి మనస్తాపం చెందిన కిష్టమ్మ ఆదివారం రాత్రి ఇంటి ఎదుట ఉన్న బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది.

ఆర్మీ ఉద్యోగం రాదేమోనని..


- పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య
- సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలో ఘటన


రమేశ్ (ఫైల్)

మద్దూరు(హుస్నాబాద్): తనకు ఎంతో ఇష్టమైన ఆర్మీ ఉద్యోగం రాదేమోనని మనస్థాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ షేక్ యూనుస్ అహ్మద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. కూటిగల్ గ్రామానికి చెందిన తీగుళ్ల రమేశ్(19) హన్మకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో ఫస్ట్ ఇయర్ చదువుతూ అక్కడే ఉంటున్నాడు. ఎలాగైనా ఆర్మీ ఉద్యోగం సాధించాలని హన్మకొండలోని ఓ ఉచిత శిక్షణ కేంద్రానికి నెల రోజుల కిందట కోచింగ్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో శిక్షణ కేంద్రం నిర్వాహకులు మెడికల్ చెకప్ చేయగా చేతులు వంకరగా ఉన్నాయి నీకు కోచింగ్ ఇవ్వలేమని తిరస్కరించారు. దీంతో ఇక జీవితంలో తాను కోరుకున్న ఆర్మీ ఉద్యోగం రాదేమోనని తీవ్ర మనస్థాపానికి గురైయ్యాడు. ఈ నెల 16వ తేదీన వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా సోమవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి బాలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి..

- చెరువులో మునిగి వ్యక్తి మృతి
- పెళ్లింట తీవ్ర విషాదం


చంద్రయ్య మృతదేహం

కౌడిపల్లి(నర్సాపూర్): కాలకృత్యాలు తీర్చుకునేందుకు చెరువు వద్దకు వెళ్లిన వ్యక్తి నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన కౌడిపల్లి మండలం వెంకట్రావ్‌పేటలో చోటు చేసుకుంది. ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పాపన్నపేట మండలం కొంపల్లి గ్రామానికి చెందిన ముక్క చంద్రయ్య(43) డ్రైవర్‌గా పనిచేస్తూ హైదరాబాద్‌లోని అపురూప కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం బామ్మర్ది పెళ్లి ఉండటంతో భార్య లక్ష్మి, పిల్లలతో కలిసి వెంకట్రావ్‌పేటకు వచ్చాడు. పెళ్లి జరిగిన అనంతరం అదే రోజు రాత్రి చంద్రయ్య మద్యం తాగి కాలకృత్యాలు తీర్చుకునేందుకు స్థానిక చెరువు వద్దకు వెళ్లాడు. ఎంత సేపటికీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామంలో, చెరువు వద్ద వెతికినా జాడ తెలియలేదు. సోమవారం మధ్యాహ్నం చెరువులో మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. తర్వాత అగ్నిమాపక సిబ్బంది వచ్చి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జులాయిగా తిరుగొద్దని మందలించడంతో..

పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య


శేఖర్‌గౌడ్(ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్) : ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మాసాయిపేట మండలం కొప్పులపల్లిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాలగోని మహేశ్వరీ, నర్సాగౌడ్ దంపతులకు ముగ్గురు కుమారులు. చిన్న కుమారుడు శేఖర్‌గౌడ్(23) ఏ పని చేయకుండా ఖాళీగా తిరుగుతుండడంతో రెండు రోజుల కిందట తండ్రి మందలించాడు. అనంతరం ఇంట్లోకి గ్యాస్ సిలిండర్ తేవాలని రూ.వెయ్యి ఇవ్వగా, ఆ డబ్బుతో అదే రోజు పురుగుల మందు కొనుగోలు చేసి పంట పొలం వద్ద తాగాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి తూప్రాన్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి చనిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.